సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం ၊ 9 ၊ ఆగస్టు ၊ 2023



ప్రభుత్వాస్పత్రిలోనే సురక్ష ప్రసవం

ప్రతి గర్భిణి ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. 8లో



మారణకాండపై శాంతి ర్యాలీ

మణిపూర్ మారణకాండను నిరసిస్తూ పాస్టర్లు, గిరిజన సంఘం, వైఎస్సార్‌సీపీ నేతలు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. 8లో



వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ

మోతుగూడెం పంచాయతీ పొల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ పోషణ కిట్లను పంపిణీ చేశారు. 9లో

న్యూస్‌రీల్

సీతారాములను దర్శించుకున్న పాడేరు ఎమ్మెల్యే



భద్రాద్రి రామాలయంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రజాప్రతినిధులు

పాడేరు: భద్రాద్రి శ్రీసీతారామచంద్రస్వామి వారిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మంగళవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు అందుకున్నారు.అనంతరం ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీతాయారు అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పోతురాజు బాలయ్య పడాల్, చింతపల్లి, కొయ్యూరు, జీకేవీధి ఎంపీపీలు కోరాబు అనూషదేవి, బడుగు రమేష్, బోయిన కుమారి, చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత, వైఎస్సార్‌సీపీ చింతపల్లి మండల అధ్యక్షుడు మోరి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ ప్రపంచ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

- నేడు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహణ




ఆదివాసీ దినోత్సవానికి సిద్ధం చేసిన వేదిక

పాడేరు: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఐటీడీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న వీఆర్ కల్యాణ మండపంలో 9వ తేదీ ఉదయం 10.30 గంటలకు వేడుకలు నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎంపీ జి. మాధవి, విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కె. భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల నేతలు పాల్గొంటారని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు 85 పవర్ వీడర్లు, 10 పసుపు ఉడికించే యంత్రాలు, 10 పాలిషర్లు పంపిణీ చేయనున్నారు.

మినీ జాబ్‌మేళా విజయవంతం

- ఉద్యోగాలకు 17 మంది ఎంపిక



జాబ్‌మేళాలో మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్న ప్రశాంత్‌కుమార్

పాడేరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ జాబ్‌మేళా విజయవంతమైంది. రెండు కంపెనీల్లో ఉద్యోగాల నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 61 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 17 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

108 వాహనంలో ప్రసవం



శిశువును చూపిస్తున్న 108 సిబ్బంది

వీఆర్‌పురం: పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆడశిశువుకు జన్మనిచ్చింది. మండలంలోని దర్భలంక గ్రామానికి చెందిన గర్భిణి మడివి అడిమికి పురిటినొప్పులు అధికమయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న వాహన సిబ్బంది రేఖపల్లి పీహెచ్‌సీలో చేర్పించేందుకు బయలుదేరారు. మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ప్రసవం చేశారు. ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చిందని 108 సిబ్బంది తెలిపారు. తల్లీబిడ్డ ఆరోగ్యం బాగానే ఉందని, వారిని రేఖపల్లి పీహెచ్‌సీలో చేర్పించామని పేర్కొన్నారు.

జీవన సౌందర్యం

ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ **దూరంలో** ఉన్న ఆదివాసీలు కేంద్ర, రాష్ట్ర **ప్రభుత్వాల** సహకారంతో అభివృద్ధి దిశగా **అడుగులు** వేస్తున్నారు. అక్షరాస్యతా శా**తం పెంచేం**దుకు ప్రభుత్వాలు చేపట్టిన **కార్యక్రమాలు** మంచి ఫలితాలనిస్తున్నాయి. **కేవలం పూస**లను దుస్తులుగా ధరిస్తూ **జీవనం సాగించే** బోండా జాతి గిరిజనుల్లో **నేటి తరం జీవ**నశైలి మారుతోంది. అక్షరాస్య**త దిశగా** అడుగులు వేస్తున్న యువత **కొలువుల్లో** స్థిరపడుతూ ఆదర్శంగా **నిలుస్తున్నారు.** నేడు ప్రపంచ ఆదివాసీ దినో**త్సవం** సందర్భంగా ప్రత్యేక కథనం..

- ఆధునికత వైపు ఆదివాసీల అడుగులు
- పెరుగుతున్న అక్షరాస్యత
- కొలువుల్లో స్థిరపడుతూ ఆదర్శం
- సత్ఫలితాలిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలు

ముంచంగిపుట్టు: ఈ ఆధునిక ప్రపంచంలో నేటికీ అర్ధనగ్నంగా జీవించే జాతి ఉన్నారంటే నమ్మశక్యం కాకపోయినా నమ్మాల్సిందే. బట్టలు లేకుండా కేవలం పూసలను దుస్తులుగా ధరిస్తూ జీవిస్తున్న ఆదివాసీలు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో నేటికీ జీవిస్తున్నారు. ఆచార వ్యవహారాలను పాటిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా జీవన విధానాన్ని మార్చుకుంటున్నారు.

ఎత్తయిన కొండలమాటున..

ప్రకృతితో మమేకమై స్వచ్ఛమైన మనసుతో జీవించే మనుషులు బోండా జాతి ఆదివాసీలు. ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన అంద్రహల్, ఒనమనాల్ ఆదివాసీల గ్రామాలున్నాయి. సుమారు 32 గ్రామాల్లో బోండా జాతి ఆదివాసీలు నివసిస్తున్నారు. బాహ్య ప్రపంచానికి దూరంగా అటవీ ప్రాంతంలో ఎత్తయిన కొండల మాటున ఈ గ్రామాలు ఉన్నాయి. వీరి జీవన విధానం చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది.



ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సులుగా పనిచేస్తున్న బోండా జాతి యువతులు



చదువులో నిమగ్నమైన బోండా గిరిజన బాలిక



ఒనకడిల్లీ సంతకు వస్తున్న పాత తరం బోండా మహిళలు

మహిళలదే పైచేయి

కుటుంబంలో మహిళలదే పైచేయి. కుటుంబం కోసం కష్ట పడేది కూడా మహిళలే. బోండా జాతి మహిళలు కేవలం పూసల్నే దుస్తులుగా ధరించి నేటికి జీవిస్తున్నారు. అటవీ ప్రాంతంలో దొరికే కొండ చీపుర్లు, తేనె, అడ్డాకులు, దుంపలు, వెదురు కొమ్ములు, జీలుగు కల్లు వంటివి సేకరించి వారపు సంతకు వచ్చి అమ్మకాలు చేపడతారు. ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో జరిగే ఒనకడిల్లీ వారపు సంతే ఆధారం.

ఫొటోకు డబ్బులివ్వాల్సిందే!

ప్రతీ గురువారం ఒనకడిల్లీలో జరిగే వారపు సంతలో మాత్రమే బోండా జాతి గిరిజనులు కనిపిస్తారు.దేశంలో నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులతో పాటు విదేశీ పర్యాటకులు సైతం వీరితో ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే ఫొటోలు దిగడం వల్ల ఆయుష్షు తగ్గిపోతాదని నమ్మకంతో అందుకు ఒప్పుకోరు. వారి అనుమతి లేకుండా ఫొటోలు తీయడానికి ప్రయత్నిస్తే దాడికి దిగుతారు. రూ.200 నుంచి రూ.500 వరకు డబ్బులు తీసుకొని ఫొటోలు దిగుతారు. వాటితో జీలుగుకల్లు తాగుతారు. ఇలా సేవించడం వల్ల ఫొటో దిగడం వల్ల పోయిన ఆయుష్షు మళ్లీ పొందుతామని చెబుతుంటారు. వీరిని చూసేందుకు ఏటా అక్టోబర్ నుంచి జనవరి వరకు అధికసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఒనకడిల్లీ సంత అంతా బోండా జాతి ఆదివాసీలు అమ్ముతున్న అటవీ వస్తువులతో నిండి ఉంటుంది. వారు తీసుకువచ్చే జీలుగుకల్లును సైతం సేవించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు.

'ఆశాకిరణ్' సహకారంతో..

ఆధునికతకు దూరంగా జీవనం సాగిస్తున్న బోండా జాతి ఆదివాసీలను మార్చాలనే సంకల్పం ఒడిశాకు చెందిన ఆశా కిరణ్ అనే స్వచ్ఛందసంస్థ నడుం బిగించింది. చిన్నారులకు విద్య అందించాలన్న ఉద్దేశంతో పాఠశాలలను ఒడిశా ప్రభుత్వ సహకారంతో ఏర్పాటుచేసింది. సుమారు పదేళ్లుగా కష్టపడి విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేసింది. పాత తరాన్ని మార్చలేక పోయినా ప్రస్తుత తరాన్ని మార్చగలిగింది. విద్యలో రాణిస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ కొలువులు సాధిస్తున్నారు. వీరికి కుల, ఆదాయ ధ్రువపత్రాలను ఒడిశా ప్రభుత్వం మంజూరు చేయడంతోపాటు అన్నిరంగాల్లోను ప్రోత్సాహం అందిస్తోంది. చైతన్యవంతులుగా తీర్చిదిద్దిన ఆశా కిరణ్ సంస్థను ఒడిశా ప్రభుత్వం సత్కరించింది.

వెలుగులు నింపిన వైఎస్సార్

సాక్షి,పాడేరు : ప్రపంచ దేశాల్లో ఆదివాసీలకు సుముచిత స్థానం ఉంది. వీరి పుట్టుక, జీవన విధానాలు, సాంస్కృతిక, ఆచార, సంప్రదాయాలకు విశేష ఆదరణ ఉంది. ప్రస్తుత ఆధునిక యుగంలోను ఆదివాసీ సమాజం తమ ఆచార, సంప్రదాయాలను కొనసాగిస్తోంది, స్వచ్ఛమైన నవ్వుతో నిర్మలమైన మనసు ఉన్న వీరిని ఆదివాసీయేతర సమాజం కూడా గౌరవిస్తుంది.

- ఆదివాసీల హక్కులు, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా అమలుచేస్తున్నాయి.
- దివంగత సీఎం వైఎస్ రాజశేఖరెడ్డి గిరిజనులకు కార్పొరేట్ స్థాయిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఉన్నత వైద్యం అందుబులోకి తెచ్చారు.
- అడవిపై అన్ని హక్కులు ఆదివాసీలకే ఉండేలా అటవీ హక్కుల చట్టాన్ని కూడా సమర్థవంతంగా అమలుచేసి ఆదివాసీల గుండెల్లో ఆయన సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.
- వైఎస్ మరణాంతరం ఆయన ఆశయ సాధనే లక్ష్యంగా తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారు.
- జిల్లాలో 8 లక్షల మంది ఆదివాసీలు ఉన్నారు. అందుకు తగ్గట్టుగానే వారి సంక్షేమానికి ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వేల కోట్లు వెచ్చిస్తోంది.



డల్లాపల్లిలో ఆదివాసీ మహిళ

తప్పిన పెను ప్రమాదం

- విద్యుత్‌లైన్‌కు జేసీబీ తగలడంతో మంటలు
- తెగిపడిన విద్యుత్ వైరు
- వెంటనే సరఫరా నిలిపివేసిన సిబ్బంది
- పావు గంట సేపు నిలిచిపోయిన కలెక్టర్ సుమిత్‌కుమార్ వాహనం



రోడ్డుపై నిలిచిన లారీపైకి ఎక్కి విద్యుత్ తీగలు సరిచేస్తున్న సిబ్బంది

కొయ్యూరు: లారీపై తీసుకువస్తున్న జేసీబీకి విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు ఏర్పడ్డాయి. ఇదే సమయంలో విద్యుత్ వైరు లైన్ వైరు తెగిపడిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలో మంగళవారం దొడ్డవరం నుంచి లారీపై తీసుకువస్తున్న జేసీబీకి గుడ్లపల్లి జంక్షన్ వద్దకు వచ్చేసరికి విద్యుత్ వైర్లు తగిలాయి. వెంటనే మంటలు రావడంతో విద్యుత్‌లైన్‌కు సంబంధించిన ఒక వైరు కాలిపడిపోయింది. ప్రమాదం సమాచారం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది లారీ వద్దకు చేరుకున్నారు. సరఫరా నిలిపివేసి జేసీబీకి తగులుకున్న విద్యుత్ లైన్ వైర్లను తొలగించారు. లోడుతో ఉన్న లారీని అక్కడి నుంచి పంపించేశారు. ఇదే సమయంలో రంపచోడవరం నుంచి పాడేరు వెళ్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ వాహనం సుమారు పావుగంట సేపు నిలిచిపోయింది. అంతవరకు ఆయన కారులోనే ఉండిపోయారు.



నిలిచిపోయిన కలెక్టర్ వాహనం

కాఫీ సాగుతో మంచి ఆదాయం

- సాగు చేపట్టే రైతులకు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం
- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

గూడెంకొత్తవీధి: మన్యంలో లాభదాయకమైన కాఫీ సాగు చేపట్టేందుకు రైతులు ముందుకు రావాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ కోరారు. కాఫీ సాగు విస్తరణలో భాగంగా వంచుల పంచాయతీ కొత్తపాలెంలో మంగళవారం పర్యటించిన ఆయన కాఫీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 16 వేల ఎకరాల్లో కాఫీ ఆసగు చేపట్టాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. దీనిలో భాగంగా ఇక్కడ కాఫీ విస్తరణ మహోత్సవం చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో కాఫీని లక్షమంది రైతులు సాగు చేస్తున్నారన్నారు. కాఫీకి అనుకూలంగా ఉన్న గూడెంకొత్తవీధి మండలంలో 129 గ్రామాల్లో 1,491 మంది రైతులతో రెండు వేల ఎకరాల్లో సాగు చేపట్టేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. కాఫీ సాగు చేపట్టే రైతులకు ఐటీడీఏ నుంచి ఎక్కువ ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కాఫీ రైతులకు మద్దతు ధర ప్రకటించడంతోపాటు వారి ఆర్థికాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జెడ్పీటీసీ శివరత్నం, వంచుల సర్పంచ్ కాసులమ్మ, పీవీటీజీ ఏపీవో వెంకటేశ్వర్లు, కాఫీ ఏడీ అశోక్‌కుమార్, మండల హార్టికల్చర్ అధికారి అరుణకుమారి, డిప్యూటీ తహసీల్దారు కుమారస్వామి, ఆర్‌ఐ మహదేవ్ పాల్గొన్నారు.



కాఫీ మొక్కను నాటుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

ఫ్యామిలీ డాక్టర్‌కు విశేష స్పందన

60 మందికి వైద్య సేవలు

పెదబయలు: మండలంలోని గోమంగి పీహెచ్‌సీ పరిధి లింగేటి ఉప ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దీనిలో భాగంగా ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో సుమారు 60 మందికి వైద్యసేవలు అందించినట్టు వైద్యాధికారి చంద్రశేఖర్ చైతన్య తెలిపారు. ఈ శిబిరంలో వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారు వైద్యసేవలు పొందారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలందించి మందులు పంపిణీ చేశారు. పలువురికి రక్త పరీక్షలు చేశారు. ఎపిడమిక్ సీజన్ కావడంతో మలేరియా, డెంగ్యూ ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతతోపాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యాధికారులు సూచించారు. సిబ్బంది విజయలక్ష్మి, మాధవి, సలోమి, 104 సిబ్బంది అజిత్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



లింగేటిలో రోగి ఇంటికి వెళ్లి పరీక్షిస్తున్న వైద్యాధికారి చంద్రశేఖర్ చైతన్య

తమ్ముడిని హతమార్చిన అన్న

డుంబ్రిగుడ: మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గసభ పంచాయతీ గొందిగుడ గ్రామంలో హత్య చోటుచేసుకుంది. భూ తగాదా నేపథ్యంలో వరుసకు తమ్ముడిని అన్న హతమార్చినట్టు పోలీసులు భావిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుందని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గొందిగుడ గ్రామంలో వరుసకు తమ్ముడైన పాంగి సాణ (55)ను అదే గ్రామానికి చెందిన పాంగి సనమ్మ (60) గొడ్డలితో నరికి చంపేశాడన్నారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృత దేహాన్ని అరకు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.



సాణ మృతదేహం



నిందితుడు సనమ్మ

నా మట్టి.. నా దేశం!

- 'నేల తల్లికి నమస్కారం.. వీరులకు వందనం'
- నేటి నుంచి అన్ని పంచాయతీల్లో ప్రారంభం
- పంచాయతీల్లో సేకరించిన మట్టి కలశాలతో ఢిల్లీకి..
- ఉపాధి హామీ నిధులతో మొక్కలు, శిలాఫలకాలు
- ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో మార్గదర్శకాల జారీ



సాక్షి, విశాఖపట్నం: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి, వారిని ఉత్తేజ పరచడానికి 'నా మట్టి–నా దేశం', 'నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం' పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దీనిని చేపడుతోంది. ఈనెల 9 నుంచి 15 వరకు గ్రామ పంచాయతీలు, మండల ప్రధాన కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల్లోనూ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏం చేస్తారంటే.. ఆయా గ్రామాల్లోని దేశం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రక్షణ రంగం, కేంద్ర సాయుధ దళాలు, పోలీసు శాఖల్లో పని చేసి పదవీ విరమణ చేసిన వారిని లేదా ప్రాణాలర్పించిన వారి కుటుంబ సభ్యులను గ్రామస్తుల సమక్షంలో ఘనంగా సత్కరిస్తారు. ఆ త్యాగమూర్తుల పేరిట శిలాఫలకాలను ఏర్పాటు చేస్తారు. వాటి చుట్టూ దీపాలంకరణ చేసి వారి త్యాగాలను స్మరించుకుంటూ కృతజ్ఞతలు తెలియజేస్తారు. వారితో ప్రతిజ్ఞ చేయిస్తారు. జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. శిలాఫలకాల వద్ద ఉన్న మట్టిని కలశాల్లోకి సేకరించి మండల కేంద్రానికి, ఆ తర్వాత జిల్లా కేంద్రానికి పంపిస్తారు. మండలానికో యువకుడిని ఎంపిక చేసి వారితో ఆ మట్టి కలశాలను దేశ రాజధాని ఢిల్లీకి పంపిస్తారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దీర్ఘకాలం ఉండే 75 మొక్కలను అనువైన చోట నాటుతారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న వారికి సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..



నా భూమి–నా దేశం.. 'నేలతల్లికి నమస్కారం.. వీరులకు వందనం' కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశాం. జాతీయత, సమైక్యతా భావాన్ని పదిమందిలో స్ఫూర్తి కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని 975 గ్రామాల్లోనూ ఈనెల 9 నుంచి చేపడతారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకోవడం, ఇంకా జీవించి ఉన్న ఇలాంటి వారిని ఘనంగా సత్కరించడం దీని ముఖ్య ఉద్దేశం. గ్రామాల్లో శిలా ఫలకాలను సిద్ధం చేస్తున్నాం. ప్రతి గ్రామంలోనూ పండగ వాతావరణంలో దీనిని నిర్వహిస్తాం.

– శ్రీరామ్మూర్తి, సీఈవో, జిల్లా పరిషత్, విశాఖపట్నం

'ఉపాధి' నిధులతో..

ఈ కార్యక్రమంలో శిలాఫలకాలు ఏర్పాటు, మొక్కలు కొనుగోలు, నాటడం సహా ఇతర ఖర్చులను ఉపాధి హామీ నిధుల నుంచి ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అలాగే శిలాఫలకాల రూపకల్పనకయ్యే ఆర్ట్‌వర్క్ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. జిల్లా అటవీ శాఖ, ఉద్యాన శాఖ, డ్వామా పీడీలు సమన్వయం చేయాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తారు.

సీఎం జగన్ మానవత్వం

అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆసరా

సాక్షి, విశాఖపట్నం/పాడేరు: వరద ప్రభావిత ప్రాంతాల పర్యటనలో భాగంగా సోమవారం కూనవరం వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. చింతూరు మండలం మల్లెతోటకు చెందిన ధర్ముల సత్తిబాబు, కుమారి దంపతులు అనారోగ్యంతో బాధపడుతున్న నాలుగేళ్ల చిన్నారి అన్వికతో కోతులగుట్ట హెలిప్యాడ్ వద్ద సీఎంను కలిసేందుకు వేచి ఉన్నారు. బస్సు ఎక్కి వెళ్లిపోతున్న జగన్ బిడ్డతో దిగాలుగా కూర్చున్న తల్లిదండ్రులను బస్సులో నుంచి గమనించారు. వెంటనే బస్సును ఆపి వారి వద్దకు వెళ్లారు. తల్లి ఒడిలో లేవలేని స్థితిలో ఉన్న నాలుగేళ్ల చిన్నారి అన్విక పరిస్థితిని చూసి సీఎం చలించారు. పుట్టిన పిమ్మట బాగానే వుందని గత రెండేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుందని, ఎన్నో ఆస్పత్రులకు తిప్పినా తమ చిన్నారికి సోకిన వ్యాధిని వైద్యులు నిర్ధారించలేకపోతున్నారని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆడుతూ పాడుతూ ఉండాల్సిన చిన్నారి ప్రస్తుతం కేవలం ఒడికే పరిమితమైందని, తమ బిడ్డకు మెరుగైన వైద్యం కల్పించి ప్రాణాలు కాపాడాలని సీఎంను వేడుకున్నారు. వెంటనే స్పందించిన సీఎం పక్కనేనున్న కలెక్టర్‌తో మాట్లాడి వైద్యబృందాన్ని రప్పించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ మేరకు వెంటనే డీఎంఅండ్‌హెచ్‌వో జమాల్‌బాషా, కూనవరం ఆస్పత్రి వైద్యబృందం అన్వికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీఎం తిరుగు ప్రయాణంలో హెలిప్యాడ్ వద్దనే మరోమారు చిన్నారి పరిస్థితిపై కలెక్టర్, ఇతర అధికారులను ఆరా తీశారు. చిన్నారి, తల్లిదండ్రుల వద్దకు సీఎం మళ్లీ వెళ్లి మీ బిడ్డకు అండగా ఉంటానని, మెరుగైన వైద్యసేవలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా తక్షణసాయం కింద రూ.లక్ష తల్లిదండ్రులకు అందించాలని సీఎం కలెక్టర్‌ను ఆదేశించారు. అలాగే చిన్నారి అన్వికకు వైఎస్సార్ పింఛను కానుక మంజూరు చేయడంతో పాటు మెరుగైన వైద్యసేవలు కల్పించేందుకు ఆస్పత్రిలో చేర్చాలని సీఎం ఆదేశించారు. గుండెజబ్బుతో బాధపడుతున్న ఓ బాధితుడిని కూడా పరామర్శించిన సీఎం మెరుగైన వైద్యసేవలు కల్పించాలని కలెక్టర్‌కు సూచించారు.

క్యాన్సర్ దంపతులకు అండగా..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూనవరంలో బస్సు ఎక్కుతుండగా పి.చిట్టెమ్మ, ఆమె భర్త రాజు వచ్చి ముఖ్యమంత్రితో మాట్లాడారు. వీరిద్దరూ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆధార్లో వయస్సు ఎక్కువగా పడడం కారణంగా తమకు సాయం అందలేదని వివరించారు. తమకు ఎటువంటి ఆధారం లేదని, మీరే సాయం చేయాలని వేడుకోవడంతో సీఎం స్పందించారు. వెంటనే కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు చెప్పి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయలు ఇవ్వాలని ఆదేశించారు.



అన్విక తల్లి కుమారి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



సీఎంను కలిసిన చిట్టెమ్మ, రాజు

క్లుప్తంగా

నేడు ఆదివాసీ వేడుకలకు ఎమ్మెల్యే హాజరు

రంపచోడవరం: స్థానిక వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్)లో బుధవారం నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు పందిరిమామిడి నుంచి గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులతో ఊరేగింపుగా వైటీసీకి చేరుకుంటారు. ఈ మేరకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఐటీడీఏ ఏర్పాట్లు చేసింది.

సీలేరులో ఎన్నికల కోడ్



రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగిస్తున్న సచివాలయ సిబ్బంది

సీలేరు: సర్పంచ్ ఉప ఎన్నికల సందడి నెలకొంది. ఇటీవలే సీలేరు సర్పంచ్ కె.పరదేశి మృతి చెందారు. ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటీఫికేషన్ జారీ చేసింది. దీంతో మంగళవారం నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఎన్నికల అధికారి స్టేజి–1 ఆఫీసర్ జె.పాపారావు ఎలక్షన్ నోటీసు అందజేశారు. సీలేరులో ఎన్నికల కోడ్ ఉండటంతో పంచాయతీలో పలుచోట్ల రాజకీయ బ్యానర్లను తొలగించారు. ఈ నెల 10న సాయంత్రం వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. సెక్రటరీ శ్రీనివాస్, మహిళా పోలీసు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ



జెండాను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు, తదితరులు

అనంతగిరి: కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మంగళవారం అనంతగిరిలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాహుల్‌గాంధీకి పార్లమెంట్ సభ్యత్వం రద్దు విషయమై ఇటీవల సుప్రీ కోర్టులో స్టే ఇచ్చినందుకు వారంతా మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శాంతిరాజు, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే సురక్ష ప్రసవం

- ఇంటి వద్ద ప్రసవాలతో మాతాశిశు మరణాలు
- గూడెంలో బర్త్ వెయిటింగ్ హాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



వై.రామవరం సీహెచ్‌సీని సందర్శించిన రంపచోడవరం అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాస్కర్

గూడెంకొత్తవీధి: ప్రతి గర్భిణి ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి సూచించారు. అవగాహన లేక కొందరు ఇంటి వద్దనే చేసుకోవడం మూలంగా తల్లీబిడ్డల మరణాలు సంభవిస్తున్నాయని వాపోయారు. జీకేవీధిలో రూ.30 లక్షలతో నిర్మించిన బర్త్ వెయిటింగ్ హాలును మంగళవారం ఆమె ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ పీహెసీకి ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. వాషింగ్ మిషన్లు, గీజర్లు సహా అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. గర్భిణులు విధిగా ప్రసవాల కోసం ఆస్పత్రికి రావాలని సూచించారు. హెచ్‌బీ నాలుగు శాతం ఉన్న వారు ఆస్పత్రికి రాకుండా ఇంటి వద్ద ప్రసవం చేసుకుంటే తల్లీబిడ్డలకు ప్రాణాపాయం ఉంటుందని హెచ్చరించారు. సరైన పద్ధతిలో ఇంటి వద్ద పురుడు పోయకపోవడంతో బిడ్డను కోల్పోవలసి వస్తుందన్నారు. దీనిపై వైద్య సిబ్బంది, ఆశాలు అవగాహన కల్పించాలని కోరారు. గర్భం దాల్చిన నాటి నుంచి పురుడు పోసుకునేంత వరకు ఆశాలు వారిని పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, సర్పంచ్ సుభద్ర, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జె. రాజులమ్మ, ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, జెడ్పీటీసీ కిముడు శివరత్నం, ఎంపీటీసీలు నాగమణి, రాజులమ్మ, సరస్వతి, కృష్ణమూర్తి, సత్యనారాయణ, సర్పంచ్‌లు వంశీకృష్ణ, రవీంద్రప్రసాద్, నేతలు జయప్రసాద్, సూకరాజు, శ్రీధర్, రాంబాబు, కోఆప్షన్ సభ్యులు దావీదు పాల్గొన్నారు

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలను ప్రోత్సహించండి

వై.రామవరం: ప్రతి గర్భిణి ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం చేసుకునేలా ప్రోత్సహించాలని రంపచోడవరం జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి. భాస్కర్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంగళవారం సాయంత్రం ఆయన సందర్శించారు. బుధవారం గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు చేసేరోజు కావడంతో ముందుగా స్కానింగు యంత్రాల పనితీరును పరిశీలించారు. ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ రాహుల్ సమక్షంలో వైద్యాధికారులకు, సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. తల్లీబిడ్డలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో సురక్షితంగా ఆస్పత్రి నుంచి ఇంటికి చేర్చే విధానంపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని మలేరియా కేసుల వివరాలను, అన్ని విభాగాలను పరిశీలించారు. ఇన్‌పేషెంటు వార్డులో అందుతున్న వైద్య సేవలు, కల్పించిన సౌకర్యాలు, భోజన వసతిపై రోగులను ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చైతన్య, జీవన్, మధులత, హెడ్ నర్సు నర్సమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలి

పార్టీ నాయకులతో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీలేరు: త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీ నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మంగళవారం సీలేరు వచ్చిన ఆమె స్థానిక పార్టీ నాయకులతో మాట్లాడారు. ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలకు, నవరత్నాలు అందిస్తుందని, పాదయాత్రలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారని, వీటిని మారుమూల గిరిజన గ్రామాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజలను చైతన్యవంతం చేసి రానున్న ఎన్నికల్లో అఖండ విజయంతో గెలిచేలా కార్యకర్తలు సైతం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. బూతు కమిటీ సభ్యులు కన్వీనర్లు కష్టపడి పనిచేయాలని, గ్రూపులు లేకుండా పని చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ కుమారి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు సాంబమూర్తి, నాయకులు బుజ్జి, వెంకట్రావు, స్వర్ణలత పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

మునగపాక: మండలంలోని చెర్లోపాలెం గ్రామానికి చెందిన కర్రెడ్ల పెంటారావు ఆచూకీ లభ్యమైందని ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ తెలిపారు. మూడు రోజులుగా గ్రామానికి చెందిన పెంటారావు కనిపించలేదంటూ అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు పెంటారావు కోసం గాలించారు. దీంతో పెంటారావు ఆచూకీ లభ్యమైనట్టు తెలుసుకున్న ఎస్ఐ ఆలీ మంగళవారం సంబంధిత కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రేమించి మోసగించిన వ్యక్తిపై కేసు

గొలుగొండ: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై గొలుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. జోగుంపేట గ్రామ పంచాయతీకి చెందిన చిట్లి శివప్రసాద్(24), పప్పుశెట్టిపాలెం గ్రామానికి చెందిన సత్య అనే యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి రెండేళ్ల పాటు ఆమె వెంట తిరిగాడు. ఆపై పెళ్లికి నిరాకరించాడు. దీంతో సత్య గొలుగొండ పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం ఇరువర్గాలను విచారించి శివప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్టు ఇన్‌ఛార్జి ఎస్ఐ ధనంజయ్‌నాయుడు తెలిపారు. సత్యకు గతంలో పెళ్లై విడాకులు తీసుకున్న తరువాత తనతో ప్రేమ వ్యవహారం జరిగిందని శివప్రసాద్ తెలిపాడు. శివప్రసాద్ జోగుంపేట పంచాయతీలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు.

అక్రమ మద్యం పట్టివేత

ఎస్.రాయవరం: మండలంలో కొత్తరేవుపోలవరం గ్రామంలో గరికిన ఎర్రయ్య అనే వ్యక్తి 40 మద్యం సీసాలుతో పట్టుబడినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు మంగళవారం తెలిపారు. గ్రామం శివారులో మద్యం సీసాలు తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

12 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు
- మూడు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం



గంజాయి నిందితులతో సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది

జి.మాడుగుల: పాడేరు–జి.మాడుగుల రోడ్డులో జి.ఎం. కొత్తూరు జంక్షన్ వద్ద పోలీసులు 12 కిలోల గంజాయిని పట్టుకున్నారు. కారుతోపాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. జి.ఎం. కొత్తూరు జంక్షన్ వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా, చింతపల్లి వైపు నుంచి వస్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. కారులో ప్రకాశం జిల్లాకు చెందిన మైలపోగు సాగర్‌బాబు, పల్నాడు జిల్లాకు చెందిన తిరుమల ఏసుబాబు, జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ నీలమెట్ట గ్రామానికి చెందిన కిల్లో కృష్ణ మైదాన ప్రాంతానికి 12 కిలోల గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. గంజాయిని, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. వీరిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. గంజాయిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

పోస్టాఫీసుల్లో రూ.25కే జాతీయ జెండా

డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ తాతునాయుడు



మారేడుమిల్లి: పంద్రాగస్టు సందర్భంగా రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలోని అన్ని సబ్ పోస్టాఫీస్, బ్రాంచ్ పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలను విక్రయిస్తున్నట్లు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ తాతునాయుడు మంగళవారం తెలిపారు. కేవలం రూ.25కే జాతీయ జెండాను అందిస్తున్నామన్నారు. ప్రజలు సమీప పోస్టాఫీసుకు వెళ్లి కొనుగోలు చేసుకుని, స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి మారుమూల గ్రామాల ప్రజలకు పోస్టాఫీసు సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో పలు లోతట్టు ప్రాంతాల్లో నూతన బ్రాంచ్ పోస్టాఫీసులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో అనేక పథకాలు ప్రారంభించామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఇవి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ రోజు మనం కూడబెట్టిన ప్రతి రుపాయి రేపటికి మనకు, మన భావితరాల వారి ఉజ్వల భవిష్యత్తుకు మేలు చేస్తుందన్నారు. ప్రతి కుటుంబంలో కనీసం ఒకరైన పోస్టల్ పథకం పొందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

స్టాఫ్ నర్సు ఉద్యోగం పేరిట టోకరా

- రూ.2 లక్షల వసూలు
- పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు

జి.మాడుగుల: స్టాఫ్ నర్సు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.2 లక్షలు తీసుకుని నకిలీ పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చి మోసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీకి చెందిన బర్లు రమాదేవి విశాఖపట్నం జిల్లా మధురవాడలో సిద్ధార్థ నర్సింగ్ కాలేజీలో 2012–16 సంవత్సరం వరకు బీఎస్సీ నర్సింగ్ చదువుకుని, గీతం ఆస్పత్రిలో 2017–20 సంవత్సరం వరకు పనిచేసింది. ప్రస్తుతం పీఎంపాలెం వేదాంత ఆస్పత్రిలో పని చేస్తోంది. ఈ క్రమంలో 2022లో ప్రభుత్వం స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వటంతో ఆమె దరఖాస్తు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా పెదబయలుకు చెందిన పాంగి రాధ తన మామయ్యగా శ్రీశైలం ప్రసాదరావును విశాఖపట్నంలో పరిచయం చేసింది. అతడు అరకులోయ కమ్యూనిటీ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సు ఉద్యోగం ఇప్పిస్తానని రమాదేవిని నమ్మించి రూ.2 లక్షలు రెండు దఫాలుగా తీసుకున్నాడు. ఈ నెల 3న పోస్టింగ్ ఆర్డర్ కాపీ ఇచ్చాడు. దానిని తీసుకుని పాడేరు డీఎంహెచ్‌వో కార్యాలయానికి వెళ్లి రిపోర్టు చేయగా అధికారులు ఇది నకిలీదని చెప్పటంతో బాధితురాలు ఒక్కసారిగా షాక్‌కు గురైంది. దాంతో తనను మోసం చేసిన ప్రసాదరావుపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మణిపూర్ మారణకాండపై శాంతి ర్యాలీ



ముంచంగిపుట్టులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు, నేతలు

ముంచంగిపుట్టు/హుకుంపేట: మణిపూర్ మారణకాండను నిరసిస్తూ క్రైస్తవ ఫిలోషిప్ పాస్టర్లు, గిరిజన సంఘం నేతలు, వైఎస్సార్‌సీపీ నేతలు ప్లకార్డులు పట్టుకుని శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ముంచంగిపుట్టు హౌలీ క్రీడా మైదానం నుంచి నాలుగు రోడ్ల వరకు సాగింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట శాంతియుత నిరసన చేశారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచులు రమేష్, త్రినాథ్, పాస్టర్లు మోహన్‌రావు, వైకుంఠరావు, జోసఫ్, రత్నమణి పాల్గొన్నారు. హుకుంపేటలో మోదకొండమ్మ ఆలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మోజేష్, కార్యదర్శి జేమ్స్ మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలను ఖండించారు. చర్చిలను కూల్చడం దారుణమన్నారు. క్రైస్తవ సంఘాలు, ప్రజా సంఘాల నేతలు కృష్ణారావు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



అరకులోయలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అరకులోయ టౌన్: దేశంలో మోదీ అధికార పీఠాన్ని గద్దె దించి దేశాన్ని రక్షించుకోవాలని సీఐటీయూ కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. ఈ సందర్భంగా మంగళవారం అరకులోయలో కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బుధవారం దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున క్విట్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని, సామాజిక భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నాయకులు వనాది, రాజు, రాంబాబు, సింహాద్రి, మగ్గన్న, తాంగుల హరి, రామన్న, రామారావు పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం

నర్సీపట్నం : నర్సీపట్నం రేంజర్ పరిధి కోటవురట్ల మండలం, బంగారయ్యపేటలో అనధికారికంగా నిల్వ చేసిన 35 టేకు మానులను స్వాధీనం చేసుకున్నామని డీఎఫ్‌వో రాజారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు రేంజర్ లక్ష్మీనర్సు, సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించి నిల్వ చేసి ఉన్న టేకు కలపను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కలప నిల్వ చేసిన బంగారయ్యపై కేసు నమోదు చేశామని డీఎఫ్‌వో తెలిపారు.

చురుగ్గా రెండో క్యాజువాలిటీ పనులు



క్యాజువాలిటీలో జరుగుతున్న పనులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెండో క్యాజువాలిటీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కార్పొరేట్ సేవలు అందిస్తున్న కేజీహెచ్‌కు రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రస్తుతం క్యాజువాలిటీలో పడకలు సరిపోవడం లేదు. దీంతో మరో క్యాజువాలిటీ నిర్మించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తయారు చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆమోద ముద్ర వేశారు. ఇందుకు అవసరమైన రూ.30 లక్షల నిధులను మంజూరు చేయడంతో టెండర్లు పిలిచి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.15 లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నుంచి, మరో రూ.15 లక్షలు సీఎస్ఆర్ నిధుల నుంచి ఖర్చు చేస్తున్నారు. క్యాజువాలిటీలో రోగుల కోసం రూ.15 లక్షలతో లేబొరేటరీ నిర్మిస్తున్నారు. అలాగే మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్ సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం కేజీహెచ్ క్యాజువాలిటీలో 20 పడకలకు పైగా ఉన్నాయి. ఇక్కడ రోజుకు 20 నుంచి 40 మంది వరకు చికిత్స పొందుతుంటారు. ఆస్పత్రికి వచ్చే ఎటువంటి అత్యవసర కేసు అయినా తొలుత క్యాజువాలిటీలో ప్రథమ చికిత్స చేస్తారు. అనంతరం వార్డులకు తరలిస్తారు. ఆ ప్రకారం క్యాజువాలిటీ రద్దీ నివారించడం కోసం 20 పడకలతో రెండో క్యాజువాలిటీ నిర్మిస్తున్నట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు ఆధ్వర్యంలో డీఈ మన్మధరావు పనులు పర్యవేక్షిస్తున్నారు. ఆధునిక సౌకర్యాలు, సెంట్రల్ ఎయిర్ కండిషన్, పడకలు, ఆక్సిజన్, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్యాజువాలిటీకి టైల్స్ వేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో రెండో క్యాజువాలిటీని ప్రారంభించే దిశగా పనులు శరవేగంగా చేస్తున్నారు.

మట్టిదిబ్బలను తొలగించండి మహాప్రభో...



కాఫీతోటల వద్ద ప్రధాన రహదారిపై మట్టిదిబ్బలు

అనంతగిరి: మండలంలోని అనంతగిరి– భీసుపురం మధ్య లో కాఫీ తోటల వద్ద మట్టిదిబ్బలు ప్రమాదభరితంగా మా రాయి. దీంతో పలువురు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారిపైకి మట్టి చేరి, దిబ్బలుగా మారింది. మలుపు కావడంతో వీటిని గమనించకపోవడంతో వాహనచోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అడుగు ఎత్తులోని మట్టిదిబ్బలు దర్శనిమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, వాటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రైల్వే ట్రాక్‌పై సత్తిబాబు మృతదేహం

కశింకోట: మండలంలోని బయ్యవరం–నరసింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. తుని రైల్వే ఎస్ఐ షేక్‌అబ్దుల్ మారూఫ్ అందించిన వివరాలివి. అనకాపల్లి నుంచి తుని వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు కింద పడి కొత్తపల్లి గ్రామానికి చెందిన మాటూరి సత్తిబాబు (42) మృతి చెందాడు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురిలో భద్రపరిచామని ఎస్ఐ తెలిపారు. మృతుని వివరాలను కుటుంబ సభ్యులకు తెలియపరిచామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు.

తాటాకిల్లు దగ్ధం

రూ.3 లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన ఇల్లు

దేవీపట్నం: ప్రమాదవశాత్తూ నిప్పంటుకోవడంతో తాటాకిల్లు దగ్ధం అయ్యింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఇందుకూరుపేటలో రైతు సందకం సుబ్బారావు ఇంటికి మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తూ నిప్పంటుకోవడంతో కాలిపోయింది. చుట్టుప్రక్కల ఇళ్లకు అగ్నికీలలు వ్యాప్తి చెందకుండా స్థానికులు మంటలను అదుపుచేశారు. ఇంట్లోని అన్ని వస్తువులు కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. సుమారు రూ.3 లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. రంపచోడవరం అగ్నిమాపక కేంద్రానికి చెందిన ఫైరింజన్ సాయంతో పూర్తిగా అదుపుచేశారు.

మేడ పైనుంచి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన శ్రీనివాసరావు

అనకాపల్లిటౌన్: శిథిలావస్థలో గల భవనం మేడ పై నుంచి పడి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలివి. గవరపాలెం ప్రాంతానికి చెందిన కణితి శ్రీనివాసరావు(41), నాగు, ప్రభాకర్ కలిసి చింతావారి వీధి సమీపంలో బోయినవారి వీధిలో శిథిలావస్థకు చేరిన భవనం మేడపైకి వెళ్లి సోమవారం రాత్రి మద్యం సేవించారు. పూటుగా మద్యం సేవించిన శ్రీనివాసరావు అక్కడే నిద్రలోకి జారుకోగా, నాగు, ప్రభాకర్‌లు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే మేడ మెట్లు లేని మార్గంలో శ్రీనివాసరావు మద్యం మత్తులో వెళ్లి పైనుంచి కిందికి పడిపోవడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. టాటానగర్‌లో ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు నెల రోజుల క్రితం అనకాపల్లి వచ్చాడు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ వి.సుబ్బరాజు, పట్టణ సీఐ దాడి మోహన్‌రావు, క్లూస్ టీమ్ బృందం శ్రీనివాసరావు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తండ్రి సూరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ సింహాచలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.